**విలేకరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో ప్రజా ఆదరణ పొందుతున్న ప్రజా ముద్ర న్యూస్ ఛానల్ మరియు పత్రిక నందు పనిచేయుటకు అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు మరియు మండలాలు వారీగా రిపోర్టర్స్ (విలేకర్లు) కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి

95738 00809

ప్రజా ముద్ర

తెలుగు డిజిటల్ దినపత్రిక

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం !

PRAJA MUDRA NEWS

Follow /

సంపుటి: 01 సంచిక: 324 సంపాదకులు కె. నరేష్ కుమార్ 25 శనివారం జులై 2026 పేజీలు: 8 వెల: రూ. 3/-

Published from , Nizamabad, Hyderabad, Rangareddy, Warangal, Medak, Mahabub Nagar, Mahabubabad, Khammam, Karimnagar, Nalgonda, Adilabad

# నగర పేదలకు బిగ్ రిలీఫ్

## మహానగరంలో సొంతింటి కల సాకారం

**రూ.11 లక్షల ఇంటికి రూ.5 లక్షల సబ్సిడీ..**

**లబ్ధిదారుడికి భారీ ఊరట**

**పోలీస్, రెవెన్యూ నిరుపయోగ స్థలాల్లో పేదల ఇళ్ల నిర్మాణం**

**ఓఆర్ఆర్ లోపలే స్థలాల గుర్తింపునకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**17 నియోజకవర్గాల్లో తొలిదశగా 7,680 ఫ్లాట్ల నిర్మాణం**

**ఈనెల 21 నుంచి దరఖాస్తుల స్వీకరణ**



**హైదరాబాద్ (ప్రత్యేక ప్రతినిధి):**“అల్పాదాయ వర్గాలకు నిరుపయోగంగా మారేలా జనావాసాలకు దూరంగా ఇళ్లను నిర్మించే ప్రసక్తే లేదు. పేదల పని ప్రదేశాలకు, ఉపాధి అవకాశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తాం” అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు కీలక సూచనలు చేశారు

**ఓఆర్ఆర్ లోపలే ప్రభుత్వ స్థలాల సేకరణ**

“నగరంలో రూఫ్‌టాప్ ఆధారంగా కాకుండా, పేదలు గౌరవంగా జీవించేలా ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాలను తక్షణమే గుర్తించాలి. రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖల పరిధిలో నిరుపయోగంగా ఉన్న భూములను ఈ ఇళ్ల నిర్మాణానికి సేకరించాలి. సేకరించిన శాఖలకు ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలాలను కేటాయించాలి” అని అధికారులను సీఎం ఆదేశించారు.

**తొలి విడతలో 7,680 ఫ్లాట్లు**

క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు

మిగతా 2లో

## కేంద్ర మంత్రులతో సీజేపీ ప్రతినిధుల గంటన్నర చర్చలు



**మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం, కేసుల ఎత్తివేతపై కేంద్రం సానుకూలత!**

**శనివారం మధ్యాహ్నం వరకు గడువు... రాజీనామా చేయకుంటే జాతీయ స్థాయి ఉద్యమం**

దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసిన పేపర్ లీకేజీల ఘటనలపై కేంద్ర ప్రభుత్వం, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధుల మధ్య గంటన్నరకు పైగా సుదీర్ఘ చర్చలు జరిగాయి. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ భేటీ అయి, విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## లక్షలాది మంది విద్యార్థులకు ఊరట


**పేపర్ లీక్ కేసులకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు!**

**ఏడాదిలోనే విచారణ పూర్తి చేసి తీర్పులు వెలువరించేలా విప్లవాత్మక మార్పులు**

**దిల్లీలో మొదటి కోర్టు ఏర్పాటు...**

**త్వరలోనే మరో నాలుగు కోర్టులు సిద్ధం**

**త్వరితగతిన శిక్ష పడేలా చట్టపరమైన సంస్కరణలు**



## సాగు, తాగునీరు, విద్యుత్ ఇచ్చేందుకూ ప్రభుత్వానికి చేతకావడం లేదు

**బొమ్మలరామారం సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖ చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు**

**కేసీఆర్ హయాంలో ఇచ్చిన 24 గంటల కరెంట్‌ను 12 గంటలకు కుదించారని ఆరోపణ**

**మిషన్ భగీరథను నిర్వీర్యం చేసి ప్రజలకు నీటి తిప్పలు పెట్టారని మండిపాటు**





## కోర్టు వీడియోల దుర్వినియోగంపై ‘సుప్రీం’ ఉక్కుపాదం

**సామాజిక మాధ్యమాల్లో రీల్స్, మీమ్స్‌గా మార్చడంపై సుప్రీం ఆగ్రహం**

**ముందస్తు అనుమతి ఉంటేనే వినియోగానికి గ్రీన్ సిగ్నల్**

**ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార చర్యలు తప్పవని హెచ్చరిక**



## సైబర్ భద్రతలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలి

**ఈ-జీరో ఎఫ్ఐఆర్‌లను అన్ని జిల్లాల్లో పటిష్టంగా అమలు చేయాలి**

**డీజీపీ సీవీ ఆనంద్**

**సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశం**

**కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తున్న ‘డిజిటల్ అరెస్ట్’ మోసాలపై ప్రత్యేక దృష్టి**



## “ఖమ్మం జిల్లాలో తాగునీటికి ఢోకా లేదు”

**‘ఎల్ నినో’ ప్రభావం ఎంత ఉన్నా నీటి కొరత రానివ్వం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ఏన్కూర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ జలాల విడుదల పర్యవేక్షణ**

**నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి గోదావరి జలాలు..**

**ముందస్తు ప్రణాళికలకు ఆదేశం**

## మోదీపై పోరాడుతుంటే ... ‘చోటాభాయ్’కి ఎందుకు కోపం?




**ఢిల్లీలో విద్యార్థుల నిరసనలకు బీఆర్ఎస్ సంపూర్ణ సంఘీభావం**

**జెన్‌జీ శక్తితో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు: కేటీఆర్ హెచ్చరిక**

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ (ప్రత్యేక ప్రతినిధి):**‘కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, అన్యాయం జరిగిన విద్యార్థుల కోసం మేము ఢిల్లీ స్థాయిలో పోరాడుతుంటే.. ఇక్కడ ఉన్న ‘చోటాభాయ్’ (రేవంత్ రెడ్డి)కి ఎందుకు అంత కోపం?” అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నిలదీశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన పోలీస్ లాఠీఛార్జ్‌కు నిరసనగా మరియు వారి పోరాటానికి మద్దతుగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీఆర్ఎస్ పార్టీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ ధర్నాలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.

**రాజకీయ అజెండాతో యువత పోరాటాన్ని మలినం చేయొద్దు**

“యువత పోరాటం వెనుక ఎలాంటి రాజకీయ అజెండా లేదు. వారు మోదీ, అమిత్ షాల కుర్చీలు లేదా అధికారాన్ని కోరడం లేదు. విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యా విధానంలో మార్పులు తీసుకురావాలని మాత్రమే కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు

మిగతా 2లో

## చట్టపరంగా ఎదుర్కొంటాం

**సత్యమే గెలుస్తుంది**

**సీదిరి అప్పలరాజుపై కేసులు రాజకీయ కక్షసాధింపే**

**అంపోలు సబ్‌జైలులో మాజీ మంత్రిని పరామర్శించిన**

**వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు ధర్మాన కృష్ణదాస్, బూడి ముత్యాలనాయుడు, కుంభ రవిబాబు**



# నగర పేదలకు బిగ్ రిలీఫ్..

తెలిపారు. తొలి దశలో రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, మేడ్చల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ వంటి 17 ప్రధాన నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. మిగతా నియోజకవర్గాల్లోనూ స్థలాల సేకరణ వేగవంతం చేయాలన్నారు.

**రూ. 5 లక్షల ప్రభుత్వ సబ్సిడీ**

ఈ ప్రాజెక్టు కింద నిర్మించే ఒక్కో ఇంటి విలువ (స్థలంతో కలిపి) రూ. 11 లక్షలు కాగా, అందులో రూ. 5 లక్షలను ప్రభుత్వమే రాయితీగా (సబ్సిడీ) భరిస్తుంది. మిగిలిన రూ. 6 లక్షల వాటాను మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**దరఖాస్తు విధానం అర్హతలు**

గడువు: ఈ నెల 21 నుండి ఆగస్టు 10 వరకు.

దరఖాస్తు మార్గాలు: మీ-సేవ కేంద్రాలు, మీ-సేవ వెబ్‌సైట్ మరియు వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫీజు వివరాలు: దరఖాస్తు రుసుము రూ. 100, డిపాజిట్ సొమ్ము రూ. 10,000 చెల్లించాలి. (ఇల్లు రాని వారికి డిపాజిట్ రూ. 10,000 వాపస్ ఇస్తారు. ఇల్లు కేటాయిస్తే లబ్ధిదారుల వాటాలో మినహాయిస్తారు).

ప్రధాన అర్హతలు:

దరఖాస్తుదారులు కనీసం 10 ఏళ్లుగా క్యూర్ (జఖ=జు) పరిధిలోనే నివసిస్తుండాలి.

కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షలు మించకూడదు.

స్వంత ఇల్లు, ప్లాటు లేదా ఫ్లాటు ఉండకూడదు. ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలి.

గతంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి గృహ లబ్ధి పొంది ఉండకూడదు.

ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రులతో సీజేపీ ప్రతినిధుల

## గంటన్నర చర్చలు

**న్యూఢిల్లీ జులై 24:**దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసిన పేపర్ లీకేజీల ఘటనలపై కేంద్ర ప్రభుత్వం, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధుల మధ్య గంటన్నరకు పైగా సుదీర్ఘ చర్చలు జరిగాయి. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ భేటీ అయి, విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు కోరుతూ వినతిపత్రం అందజేశారు.

సీజేపీ ప్రధాన డిమాండ్లు:

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణ రాజీనామా (లేదా పదవి నుంచి తొలగింపు). పేపర్ లీకేజీల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున పరిహారం. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై నమోదైన పోలీసు కేసుల తక్షణ ఎత్తివేత.

పరిహారం చెల్లింపు, కేసుల ఎత్తివేత అంశాలపై ప్రభుత్వం సూత్రప్రాయంగా సానుకూలత వ్యక్తం చేసినట్లు సీజేపీ నేతలు తెలిపారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయమై స్పందించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం మధ్యాహ్నం వరకు సమయం కోరిందని వెల్లడించారు.

**రాజీనామా చేయకపోతే జాతీయ ఉద్యమం: సీజేపీ హెచ్చరిక**

మంత్రి రాజీనామా ఆమోదించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని, జాతీయ స్థాయి పోరాటానికి పిలుపునిస్తామని సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ హెచ్చరించారు. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్పందిస్తూ... "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తీసుకోకపోతే, రోడ్లపైకి వచ్చిన యువత ప్రధాని రాజీనామానే డిమాండ్ చేసే పరిస్థితి వస్తుంది" అని వ్యాఖ్యానించారు.

**సుహృద్భావ వాతావరణంలో చర్చలు: జేపీ నడ్డా**

చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయని, ఆందోళనకారుల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. శనివారం మధ్యాహ్నం తర్వాత మరోసారి సమావేశమై అన్ని అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**సుప్రీంకోర్టు మెట్లెక్కిన నిరసనల వివాదం**

మరోవైపు నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. జులై 27న ఈ కేసును విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం సమ్మతించింది. సీనియర్ న్యాయవాదులు శ్యామ్ దివాన్, గోపాల్ శంకరనారాయణన్ ఈ విషయాన్ని అత్యవసర విచారణ కింద కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

# లక్షలాది మంది విద్యార్థులకు ఊరట...

**న్యూఢిల్లీ జులై 24:**దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్న వేళ, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న '2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం'లో సవరణలు చేసి, శిక్షలను మరింత కఠినతరం చేసే బిల్లు ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

**ఏ క్షమాపణా ఉండదు: ప్రధాని మోదీ స్పష్టీకరణ**

ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని ఏమాత్రం సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం విడుదల చేసిన ప్రత్యేక వీడియో సందేశంలో తీవ్ర హెచ్చరిక చేశారు. లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసుల విచారణను వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

చట్ట సవరణలు -- పెరగనున్న శిక్షల తీవ్రత

ప్రస్తుత చట్టం ప్రకారం:

వ్యక్తిగత నేరాలకు: 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా.

వ్యవస్థీకృత నేరాలకు: 5 నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా.

అయితే, ఈ శిక్షలు సరిపోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుండటంతో జైలు శిక్షా కాలాన్ని, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచేలా సవరణలు తెస్తున్నారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు, నేర ముఠాల ప్రమేయం ఉన్న కేసుల్లో అత్యంత కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు.

**ఏడాదిలోనే తీర్పు.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు**

విచారణల్లో ఆలస్యం కాకుండా కేసులను ఏడాది లోపే పూర్తి చేసి తీర్పులు ఇచ్చేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే దిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలోనే మరో నాలుగు కోర్టులను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేశారు.

# అబ్దుల్ కలాం ఎదగడానికి తల్లే స్ఫూర్తి.....

వి**శాఖ/రంపచోడవరం జులై 24:**ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమన్వయంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకువస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యత అని పునరుద్ఘాటించారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన 'మెగా పీటీఎం' (మాతాపితరులు-ఉపాధ్యాయుల సమావేశం) కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ విద్యాలయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, అభివృద్ధి దిశగా పయనిస్తున్నామని చెప్పారు.

**'తల్లికి వందనం' గౌరవ ప్రతీక**

"తల్లికి వందనం అనేది కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదు, సమాజంలో అందరినీ గౌరవించే ఒక అద్భుత కార్యక్రమం. ఇంట్లో అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ ఉంటే ఒక్కరినే చదివించాలనే పాత ఆలోచన ధోరణిని దాటి, ఇద్దరికీ విద్యనందించాలనే లక్ష్యంతోనే ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం" అని లోకేశ్ వివరించారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సాయాన్ని పిల్లల భవిష్యత్తు కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**పాఠ్యపుస్తకాల్లో లింగ సమానత్వం**

పాఠశాల స్థాయి నుంచే లింగ సమానత్వాన్ని పెంపొందించేలా మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. పుస్తకాల్లో ఇంటి పనులు చేసే చిత్రాల్లో సగం మగ, సగం ఆడ పాత్రలు ఉండేలా కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన రూపురేఖలుదిద్దామని చెప్పారు. ప్రసిద్ధ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు చెప్పిన "తల్లికి చెప్పలేని ఏ పని చేయవద్దు" అనే మాట నన్ను ఎంతో ప్రభావితం చేసిందని, విద్యార్థులంతా విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు.

**మరో 3 వేల టీచర్ పోస్టుల భర్తీ**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారని, వారి ప్రతిభే తన శ్రమకు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేశామని గుర్తుచేసిన మంత్రి, రానున్న రోజుల్లో మరో 3,000 టీచర్ పోస్టులను కూడా భర్తీ చేయబోతున్నట్లు వెల్లడించారు.

# "సైబర్ భద్రతలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలి"

హైదరాబాద్ (ప్రత్యేక ప్రతినిధి):రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థంగా అరికట్టడానికి సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని తెలంగాణ పోలీసు శాఖ నిర్ణయించింది. జాతీయ స్థాయిలో సైబర్ భద్రతా సూచికల్లో తెలంగాణను ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీ.వీ. ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని పోలీసు యూనిట్ అధికారులతో డీజీపీ సైబర్ భద్రత, ఈ-జీరో ఎఫ్ఐఆర్ , సీసీటీఎన్ఎస్ అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై కేంద్రం తీవ్ర ఆందోళన

"దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ మోసాలు, ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ముఠాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. కేంద్ర గృహ మంత్రిత్వ శాఖకు చెందిన 'భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం' తొమ్మిది కీలక ప్రమాణాల ఆధారంగా రాష్ట్రాల పనితీరును నిరంతరం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోని ప్రతి విభాగం తన పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలి" అని డీజీపీ స్పష్టం చేశారు.

ఈ-జీరో ఎఫ్ఐఆర్‌ల అమలు వేగవంతం

రాష్ట్రవ్యాప్తంగా ఈ-జీరో ఎఫ్ఐఆర్ విధానం ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంపై డీజీపీ దృష్టి సారించారు:

గత రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర సైబర్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో దాదాపు 20 ఈ-జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడాన్ని ఆయన అభినందించారు.

ఇదే స్ఫూర్తితో ఈ విధానాన్ని అన్ని జిల్లాల్లో వేగంగా, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో త్వరిత సేవలు

"ప్రజల ఆర్థిక భద్రతను కాపాడటంలో సైబర్ నేరాల నియంత్రణ అత్యంత కీలకం. సైబర్ నేరస్థుల ఆటకట్టించేందుకు సాంకేతికతను ముమ్మరంగా ఉపయోగించాలి."
సీ.వీ. ఆనంద్, తెలంగాణ డీజీపీ

ముఖ్యమైన ఆదేశాలు:

సైబర్ నేరాల దర్యాప్తులో 'నేరాలు--నేరస్థుల సమాచార వ్యవస్థ'ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి.

పోలీసు సిబ్బందికి నిరంతరం అధునాతన సైబర్ శిక్షణ ఇవ్వడంతో పాటు, సాధారణ ప్రజలలో సైబర్ మోసాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థంగా వాడుతూ బాధితులకు వేగవంతమైన సేవలు అందించేందుకు అన్ని పోలీసు యూనిట్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## కోర్టు వీడియోల దుర్వినియోగంపై 'సుప్రీం' ఉక్కుపాదం!

న్యూఢిల్లీ జులై 24:న్యాయస్థానాల విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌ల వినియోగంపై సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు విచారణ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై కఠిన నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఒకవేళ ఈ వీడియోలను ఎవరైనా ఉపయోగించాలనుకుంటే సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ లేదా ఆయా రాష్ట్రాల హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది.

**వ్యూస్ కోసం మీమ్స్, రీల్స్ చేస్తే చర్యలు!**

కోర్టు విచారణల ప్రత్యక్ష ప్రసారాల (లైవ్ స్ట్రీమింగ్) వీడియోలను సోషల్ మీడియాలో దుర్వినియోగం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా విచారణ దృశ్యాలను మీమ్స్, రీల్స్, షార్ట్స్ రూపంలో వ్యాప్తి చేయడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కేవలం వ్యూస్, లైక్స్ కోసం కోర్టు వ్యాఖ్యలను సంచలనంగా మార్చడం వల్ల జడ్జీలు, న్యాయవాదుల గౌరవానికి తీవ్ర భంగం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనలను ఉల్లంఘించి అనుమతి లేకుండా వీడియోలు అప్‌లోడ్ చేస్తే కోర్టు ధిక్కార (కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్) చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

**కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు**

సామాజిక మాధ్యమాల్లో కోర్టు దృశ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తీసుకోబోయే చర్యలు, మార్గదర్శకాలపై పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

## చట్టపరంగా ఎదుర్కొంటాం...

శ్రీకాకుళం జులై 24:మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై నమోదు చేసిన కేసులు కేవలం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా అంపోలు సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న సీదిరి అప్పలరాజును శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ములాఖాత్‌లో కలిశారు. జైలు అధికారులు కేటాయించిన సమయంలో మాజీ మంత్రితో భేటీ అయిన నాయకులు ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.

అప్పలరాజుకు పార్టీ పూర్తి అండగా ఉంటుంది: ధర్మాన, బూడి

ములాఖాత్ అనంతరం ధర్మాన కృష్ణదాస్ విలేకరులతో మాట్లాడుతూ..."ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకులను అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేయాలని చూడటం సరికాదు. ఇటువంటి బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరు. చట్టపరంగా ఈ వ్యవహారాన్ని ఎదుర్కొంటాం. అంతిమంగా సత్యమే గెలుస్తుందనే నమ్మకం మాకుంది."

ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ... "సీదిరి అప్పలరాజుకు, ఆయన కుటుంబానికి పార్టీ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుంది. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాం. రాజకీయ ఒత్తిళ్లతో పార్టీ శ్రేణులను భయపెట్టలేరు. ప్రజా సమస్యలపై మా పోరాటం ఆగదు."జిల్లా పరిశీలకుడు కుంభ రవిబాబు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగుతామని, అక్రమ కేసులను న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. కార్యకర్తలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ -- శ్రేణుల్లో ధైర్యం

సబ్‌జైలులో సీదిరి అప్పలరాజును పరామర్శించిన అనంతరం, వైఎస్సార్‌సీపీ నేతలు ఆయన కుటుంబ సభ్యులను నేరుగా కలిసి ధైర్యం చెప్పారు. మాజీ మంత్రికి పూర్తి న్యాయం జరిగే వరకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు. కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ ములాఖాత్ కార్యక్రమంలో టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్యక్షుడు రాజపు అప్పన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె.సి.హెచ్. గుప్తా, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కనపల శేఖర్‌రావు, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జెడ్పీ ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఎర్ర చక్రవర్తి పాల్గొన్నారు.

అలాగే రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శులు కిల్లి అజయ్, పంచిరెడ్డి శివతో పాటు కణితి నారాయణమూర్తి, చిన్ని జోగారావు, సతివాడ రామినాయుడు, కల్లేపల్లి లక్ష్మణరావు, బుద్దల రాజశేఖర్, యాబాజీ రమేష్, వాకముల్ల చక్రధర్, నేతింటి రాజేశ్వరరావు, పాగోటి గోవింద, మాజీ సర్పంచులు అవ్వ రవీంద్రరెడ్డి, యెన్ని వెంకటేష్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మోదీపై పోరాడుతుంటే....

## 'చోటాభాయ్'కి ఎందుకు కోపం?

గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేస్తుంటే, పోలీసులతో దాష్టీకం చేయించడం దారుణం. ప్రధాన మీడియా చూపించకపోయినా 'జెన్ జీ' సోషల్ మీడియా వేదికగా దేశాన్ని కదిలించింది" అని కేటీఆర్ తెలిపారు.

**జెన్ జీ శక్తిని తక్కువగా అంచనా వేయొద్దు**

కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ కేటీఆర్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు:

ప్రపంచ దేశాల ఉదాహరణలు: "ఎవరితో పెట్టుకోకూడదో ఆ యువత (జెన్ జీ)తోనే మోదీ పెట్టుకున్నారు. యువత తిరగబడితే నేపాల్‌లో ప్రభుత్వం కుప్పకూలింది, శ్రీలంకలో పాలకులు దేశం విడిచి పారిపోయే పరిస్థితి వచ్చింది. ఈ తరం యువత ఐటీ, సీబీఐ, ఈడీ దాడులకు భయపడదు."

సొంత నియోజకవర్గంలో దాక్కున్న సీఎం: "దేశమంతా మోదీని, ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రశ్నిస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కొడంగల్‌లో వెళ్లి దాక్కున్నారు. మోదీకి భయపడే రేవంత్ రెడ్డి నోరు మెదపడం లేదు."

**పేపర్ లీక్ ఆరోపణలపై ఉరితీసినా సిద్ధమే!**

తనపై చేసిన పేపర్ లీక్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. "నాకు సంబంధం లేని పేపర్ లీక్ అంశంలో నాపై ఆరోపణలు చేసినందుకు లీగల్ నోటీసులు పంపాను. రేవంత్ రెడ్డి తన ఆరోపణలను నిరూపిస్తే, ఇదే ఇందిరాపార్క్ వద్ద నన్ను ఉరితీసినా సిద్ధమే" అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

డిమాండ్లు:

విద్యార్థుల పోరాటానికి మద్దతుగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి.

ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎలాంటి రాజకీయం లేకుండా బీఆర్ఎస్ ఈ పోరాటానికి మద్దతు ఇస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# "ఖమ్మం జిల్లాలో తాగునీటికి ఢోకా లేదు"



ఖమ్మం (ప్రత్యేక ప్రతినిధి):ఖమ్మం జిల్లా ప్రజలకు ఎలాంటి తాగునీటి కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద సీతారామ ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి విడుదలవుతున్న గోదావరి జలాల ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు

'ఎల్ నినో' ఉన్నా నిరంతర నీటి సరఫరా

"ప్రకృతి వైపరీత్యాలు లేదా 'ఎల్ నినో' ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తడానికి వీల్లేదు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలి" అని ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి, ప్రజలకు నిరంతరం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలి. జల వనరుల నిర్వహణలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా, క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలి.

**ప్రభుత్వ ప్రధాన లక్ష్యం తాగునీటి భద్రతే!**

"ప్రజలకు నిరంతర తాగునీటి భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా ముందస్తు ప్రణాళికలతో సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం పక్కా చర్యలు చేపడుతోంది."

భట్టి విక్రమార్క, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి

అవసరమైన ప్రాంతాలకు ముందస్తుగానే నీటి సరఫరా ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు డెడ్ లైన్ విధించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చిన్న నిర్లక్ష్యం... పూడ్చలేని విషాదం!

## సంపాదకీయం

ప్రతి సంవత్సరం జూలై 25న 'ప్రపంచ మునకల నివారణ దినోత్సవం' జరుపుకోవడం కేవలం క్యాలెండర్‌లో ఒక తేదీని గుర్తుచేసుకోవడానికి మాత్రమే కాదు. సముద్రాలు, నదులు, చెరువుల నుంచి ఇంటి ఆవరణలోని నీటి గుంతల వరకు... మునిగిపోవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే, ఈ మరణాల్లో అత్యధిక భాగం సరైన అవగాహన, ముందస్తు జాగ్రత్తలు, సరైన శిక్షణతో సంపూర్ణంగా నివారించవచ్చనే కఠోర సత్యాన్ని సమాజానికి గుర్తుచేయడమే ఈ రోజు అంతర్లీన లక్ష్యం.

వర్షాకాలం... పొంచి ఉన్న మృత్యుఘంటికలు

ప్రత్యేకించి వర్షాకాలం ప్రారంభం కాగానే మన దేశంలో మునక ప్రమాదాల వార్తలు రోజువారీ శీర్షికలుగా మారుతుంటాయి. నదులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే సమయంలో ప్రదర్శించే చిన్నపాటి నిర్లక్ష్యం కూడా క్షణాల్లో ప్రాణాంతకంగా పరిణమిస్తోంది.

ఈత రాకపోయినా ప్రవాహాల లోతును అంచనా వేయకుండా నీటిలోకి దిగడం.

వరద ఉద్ధృతిని తేలికగా తీసుకుని దాటే ప్రయత్నం చేయడం.

స్నేహితుల ఒత్తిడికి లొంగి ప్రమాదకర ప్రాంతాల్లో ఈతకు దిగడం.

ఈ తరహా పొరపాట్ల వల్ల అనేకమంది--- ముఖ్యంగా యువత, చిన్నారులు --- తమ అమూల్యమైన ప్రాణాలను బలితీసుకుంటున్నారు. ఇది కేవలం వ్యక్తిగత అలసత్వం మాత్రమే కాదు, సమాజంలో నీటి భద్రతపై ప్రాథమిక అవగాహన లోపానికి నిదర్శనం.

2. కనిపించని గుంతలు... క్షణకాల పర్యవేక్షణా లోపం!

మునక ప్రమాదాలు కేవలం పెద్ద నదులు లేదా సముద్రాల్లోనే జరుగుతాయనుకోవడం పొరపాటు. గ్రామీణ ప్రాంతాల్లోని తెరచి ఉన్న బావులు, వ్యవసాయ నీటి నిల్వలు, గృహ ప్రాంగణాల్లోని నీటి తొట్టెలు , నిర్మాణ స్థలాల్లో వర్షపు నీటితో నిండిన లోతైన గుంతలు కూడా ప్రమాదకర మృత్యుకుహరాలుగా మారుతున్నాయి.

చిన్న పిల్లలను క్షణం పాటు పర్యవేక్షణ లేకుండా ఒంటరిగా వదిలేయడం వల్ల ఎన్నో కుటుంబాల్లో పూడ్చలేని విషాదం నిండుతోంది. నీటి వనరుల సమీపంలో చిన్నారులపై నిరంతర నిఘా ఉంచడం ప్రాథమిక అత్యవసర బాధ్యత.

3. పాఠశాల నుంచే శిక్షణ... ఈత ఒక 'జీవన నైపుణ్యం'

నీటి భద్రతపై అవగాహన పాఠశాల స్థాయి నుంచే పాఠ్యాంశంగా మారాలి. ఈత నేర్చుకోవడాన్ని విలాసంగా కాకుండా, ప్రతి ఒక్కరి 'జీవన నైపుణ్యం'గా గుర్తించాలి.

ప్రాథమిక ప్రాణరక్షణ: అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి?

రక్షణ పద్ధతులు: నీటిలో మునుగుతున్న వ్యక్తిని స్వయంగా ప్రమాదంలో పడకుండా సురక్షితంగా ఎలా బయటకు తీయాలి?ఇలాంటి అంశాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోవచ్చు.



4. వ్యవస్థల బాధ్యత... రక్షణ చర్యలు తప్పనిసరి!

ఈ ప్రమాదాల అరికట్టడంలో ప్రభుత్వాలు, స్థానిక యంత్రాంగం మరియు పంచాయతీ/పురపాలక సంస్థల పాత్ర అత్యంత కీలకం ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి.వరద సమయాల్లో ప్రమాదకర ప్రదేశాల్లోకి ప్రజలను అనుమతించకుండా నిబంధనలు కఠినతరం చేయాలి.పర్యాటక ప్రాంతాలు, స్నాన ఘట్టాల వద్ద శిక్షణ పొందిన లైఫ్‌గార్డ్స్ (ప్రాణరక్షణ సిబ్బంది)ను నిరంతరం అందుబాటులో ఉంచాలి.జిల్లా స్థాయి విపత్తు నిర్వహణ బృందాలను ఆధునిక పరికరాలతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలి.

రీల్స్, సెల్ఫీల పిచ్చి... ప్రాణాలతో చెలగాటం!

సామాజిక మాధ్యమాల ప్రభావంతో ప్రమాదకర ప్రదేశాల్లో వీడియోలు, సెల్ఫీలు చిత్రీకరించే ధోరణి ఇటీవల తీవ్ర రూపం దాల్చింది. ఉప్పొంగే వరద ప్రవాహాల్లో నిలబడటం, వంతెనల పైనుంచి నీటి ఉద్ధృతిని దగ్గరగా చూడటానికి ప్రయోగాలు చేయడం, సాహస విన్యాసాలు చేయడం వంటి చర్యలు కనురెప్పపాటులో కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. కొన్ని క్షణాల 'లైక్‌లు', 'కామెంట్ల' కోసం జీవితాన్ని పణంగా పెట్టడం ఏమాత్రం వివేకం అనిపించుకోదు.

ప్రతి ప్రాణం అమూల్యమైనది: కుటుంబ స్థాయిలో తల్లిదండ్రులు పిల్లలకు నీటి ప్రమాదాల గురించి నిరంతరం వివరించాలి. పెద్దలు కూడా నీటి వనరుల వద్ద బాధ్యతాయుతంగా ప్రవర్తించి ఆదర్శంగా నిలవాలి.మునక అనేది నివారించలేని విధి కాదు... అది అవగాహన, అప్రమత్తత, శిక్షణ మరియు సమిష్టి బాధ్యతతో నివారించగలిగే ప్రమాదం. నీటి భద్రతను ప్రతి ఇల్లు, ప్రతి పాఠశాల, ప్రతి గ్రామం ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించినప్పుడే ఈ మరణాలకు అడ్డుకట్ట వేయగలుగుతాం. "ప్రతి ప్రాణం అమూల్యమైనది" అనే స్పృహతో ముందడుగు వేయడమే అంతర్జాతీయ మునకల నివారణ దినోత్సవానికి మనం ఇచ్చే నిజమైన నివాళి!

# ఆశ కోల్పోయిన కుటుంబాలకు కొత్త వెలుగు

ప్రతి సంవత్సరం జూలై 25న ప్రపంచ భ్రూణ శాస్త్రవేత్తల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ఆశాకిరణంగా నిలుస్తున్న భ్రూణ శాస్త్రవేత్తల సేవలను గుర్తించి గౌరవించేందుకు ఈ దినాన్ని జరుపుకుంటారు. ప్రయోగశాలల్లో అత్యంత నిశితంగా పనిచేస్తూ కొత్త జీవితానికి బీజం వేసే ఈ నిపుణుల కృషి వైద్యరంగంలో ఎంతో విలువైనదిగా గుర్తింపు పొందింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు తమ సంతాన సాఫల్యానికి ఈ శాస్త్రవేత్తల సేవలను ఆధారంగా చేసుకుంటున్నాయి. భ్రూణ శాస్త్రం అనేది అత్యంత సున్నితమైన, అత్యున్నత నైపుణ్యం అవసరమయ్యే వైద్యశాఖ. ఇందులో అండం, వీర్యకణాల నాణ్యతను పరిశీలించడం, వాటిని సరైన పరిస్థితుల్లో కలిపి ఫలదీకరణ జరిగేలా చేయడం, ఏర్పడిన భ్రూణాల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను భ్రూణ శాస్త్రవేత్తలు నిర్వహిస్తారు. ప్రయోగశాలలో ప్రతి నిమిషం, ప్రతి ఉష్ణోగ్రత, ప్రతి ప్రక్రియ అత్యంత కచ్చితత్వంతో నిర్వహించాల్సి ఉంటుంది.ప్రపంచంలో మొట్టమొదటి విజయవంతమైన కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన శిశువు లూయిస్ బ్రౌన్ 1978 జూలై 25న జన్మించింది. ఈ చారిత్రాత్మక విజయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది జూలై 25న ప్రపంచ భ్రూణ శాస్త్రవేత్తల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విజయంతో సంతానలేమికి చికిత్సలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ రంగంలో అనేక సాంకేతిక పురోగతులు చోటుచేసుకున్నాయి. నేటి జీవనశైలి, కాలుష్యం, మానసిక ఒత్తిడి, ఆలస్య వివాహాలు, హార్మోన్ల అసమతుల్యత, మధుమేహం, ఊబకాయం వంటి అనేక కారణాల వల్ల సంతాన సమస్యలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు అరుదుగా కనిపించిన ఈ సమస్యలు ఇప్పుడు అనేక కుటుంబాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆధునిక సంతానోత్పత్తి చికిత్సలు వేలాది దంపతులకు కొత్త ఆశను అందిస్తున్నాయి.భ్రూణ శాస్త్రవేత్తలు కేవలం ప్రయోగశాలలో పని చేసే నిపుణులు మాత్రమే కాదు. వైద్యులు, నర్సులు, జన్యు నిపుణులు, ఇతర సాంకేతిక నిపుణులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి రోగికి అనుగుణంగా చికిత్సా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. వారి అనుభవం, పరిశీలన, శాస్త్రీయ నైపుణ్యం చికిత్స విజయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం అత్యాధునిక పరికరాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశీలనా విధానాలు, సమయానుకూల చిత్రీకరణ సాంకేతికత, జన్యు పరీక్షలు వంటి అనేక ఆధునిక పద్ధతులు భ్రూణ శాస్త్రంలో వినియోగంలోకి వచ్చాయి. వీటి ద్వారా ఆరోగ్యవంతమైన భ్రూణాలను గుర్తించే అవకాశాలు పెరిగాయి. ఫలితంగా చికిత్సల విజయశాతం కూడా గతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడుతోంది.భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా సంతానోత్పత్తి చికిత్సా కేంద్రాల సంఖ్య వేగంగా పెరిగింది. మెట్రో నగరాలతో పాటు జిల్లా కేంద్రాల్లో కూడా ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. నైపుణ్యం కలిగిన భ్రూణ శాస్త్రవేత్తలు, అత్యాధునిక ప్రయోగశాలలు, నాణ్యమైన వైద్య సేవలతో దేశం వైద్యరంగంలో మంచి గుర్తింపు పొందుతోంది. విదేశాల నుంచి కూడా కొందరు చికిత్స కోసం భారత్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే సంతాన చికిత్సల విషయంలో ప్రజలు అపోహలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. సామాజిక ఒత్తిళ్లు, మూఢనమ్మకాలు, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించాలి. చికిత్సను సరైన సమయంలో ప్రారంభిస్తే విజయావకాశాలు మరింత పెరుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం కూడా సంతాన ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయి.భ్రూణ శాస్త్రవేత్తల పని ఎంతో బాధ్యతతో కూడుకున్నది. ఒక చిన్న పొరపాటు కూడా మొత్తం చికిత్సపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే వారు అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, కఠిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, నిరంతర శిక్షణతో తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ సేవలు అందిస్తుంటారు. వారి అంకితభావం వల్లే అనేక కుటుంబాల్లో నవ్వులు పూస్తున్నాయి. ప్రపంచ భ్రూణ శాస్త్రవేత్తల దినోత్సవం ఈ రంగంలో సేవలందిస్తున్న నిపుణుల కృషిని గుర్తించడమే కాకుండా, సంతాన సమస్యలపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు కూడా ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. శాస్త్రీయ ఆలోచన, ఆధునిక వైద్యం, నిపుణుల సేవలు కలిసి వేలాది కుటుంబాలకు తల్లిదండ్రులుగా మారే అపూర్వమైన ఆనందాన్ని అందిస్తున్నాయి. ఈ దినోత్సవం భ్రూణ శాస్త్రవేత్తల సేవలకు సమాజం కృతజ్ఞతలు తెలియజేసే సందర్భంగా భావించవచ్చు.





## "సాగు, తాగునీరు, విద్యుత్ ఇచ్చేందుకూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు"

**యాదాద్రి భువనగిరి (ప్రత్యేక ప్రతినిధి):**"రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైంది" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం ఆలేరు నియోజకవర్గం బొమ్మలరామారం మండలంలోని సోలేపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ లాగ్‌బుక్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

**12 గంటల విద్యుత్‌కే కోతలు**

"గతంలో రైతులకు అందించిన నిరంతర విద్యుత్ సరఫరా గంటలను తగ్గించి, ప్రస్తుతం రోజుకు కేవలం 12 గంటలు మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు లాగ్‌బుక్ చూస్తే అర్థమవుతోంది. ప్రభుత్వం చెప్తున్న ఆ 12 గంటల సరఫరాలో కూడా నిరంతరం ట్రిప్పింగ్స్ వస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది" అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

**రెండు రోజులకోసారి తాగునీరా?**

బొమ్మలరామారంలో స్థానిక మహిళలు తనతో మాట్లాడారని, అక్కడ రెండు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు వస్తోందని విన్నవించుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. "కేసీఆర్ హయాంలో 'మిషన్ భగీరథ' ద్వారా ప్రతిరోజూ శుద్ధి చేసిన తాగునీరు అందించాం. కానీ ప్రస్తుతం ఉన్న వ్యవస్థను కూడా సమర్థంగా నిర్వహించడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు" అని ఎద్దేవా చేశారు.

**యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లలో ఉత్పత్తి ఏది?**

యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోవడంపై ప్రభుత్వం తక్షణమే జవాబు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, ఇతర ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతు బీమా కింద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అర్హులైన కుటుంబాలకు పరిహారం అందడం లేదని మండిపడ్డారు.

బీఆర్ఎస్ ప్రధాన డిమాండ్లు:

యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లలో నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించి, రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు అందించాలి.

మిషన్ భగీరథపై సమగ్ర సమీక్ష నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలి.

రైతుల సంక్షేమ పథకాలు, రైతు బీమా పెండింగ్ దరఖాస్తులపై తక్షణమే సమీక్ష నిర్వహించి పరిహారం అందించాలి.

## డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు



హైదరాబాద్, జూలై 24 : రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో మాదక ద్రవ్యాలకు సంబంధించిన ఏ ఘటన జరిగినా ఆయా యాజమాన్యాలు కూడా బాధ్యత వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీల పనితీరుపై ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు అవసరమైతే ప్రత్యేక చట్టం రూపొందించే అంశాన్ని అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా సంస్థల ప్రాంగణాల వెలుపల జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రతి విద్యా సంస్థలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మాదక ద్రవ్యాల నిరోధంలో విద్యా సంస్థలకు అధికారాలతో పాటు స్పష్టమైన బాధ్యతలను కూడా అప్పగించాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా అందించేందుకు ప్రతి విద్యా సంస్థలో టోల్‌ఫ్రీ నంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

డ్రగ్స్ కార్యకలాపాలను గుర్తించడం, వినియోగిస్తున్న వారిని వ్యసనం నుంచి బయటపడేయడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం అనే మూడు దశల్లో సమర్థవంతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తొలిసారి పట్టుబడిన వారిని వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ అందించడంతో పాటు, పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు విధించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి యువతను ఈ ముప్పు నుంచి రక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.




# దేవదాయ శాఖలో అవినీతి తిమింగలం

## రూ.25 వేలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి అడ్డంగా దొరికిన అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్

## వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి



అనంతపురం, అనంతపురంలోని దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ గా పని చేస్తున్న గంజి మల్లికార్జున ప్రసాద్ రూ.25 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు శుక్రవారం అడ్డంగా దొరికి పోయారు. పుట్లూరు మండలం చెర్లోపల్లి(రామలింగయ్యపల్లి)లో ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వారు గతంలో రూ.10 లక్షలు మంజూరు చేశారు. అందులో రూ.5 లక్షలకు ఒకసారి, రూ.3 లక్షలకు మరోసారి చెక్కు రూపంలో బిల్లులు చెల్లించారు. మిగిలిన రూ.2 లక్షలు చెల్లించేందుకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ను



కలిశారు. అయితే చివరి బిల్లు ఇవ్వాలంటే తనకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, ఏసీబీ సీఐ హమీద్ ఖాన్ బృందం ఇచ్చిన డైరెక్షన్ ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ దేవాదాయ శాఖ కార్యాలయానికి వెళ్లి అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ను కలసి రూ.25 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ బృందం వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. అనంతరం ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐ హమీద్ ఖాన్ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. కేసు సమగ్రంగా విచారణ చేసిన అనంతరం పట్టుబడిన సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ను కర్నూలులోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. కాగా మల్లికార్జున ప్రసాద్ మరో వారంలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉందని తెలిసింది. అంతలోనే ఇలా ఏసీబీకి దొరకడం గమనార్హం.

# తాడిపత్రిలో విద్యాసంస్థల బంద్

తాడిపత్రి: నీట్ పరీక్షా విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడిపత్రి లో ఏఐఎస్ఎఫ్ , ఏఐఎస్బీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, ఏఐఎస్బీ తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి సుకృత్ మాట్లాడుతూ, నీట్ పరీక్షా విధానం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ విధానాన్ని రద్దు చేసి విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలని, అలాగే ఢిల్లీలో జరిగిన లాఠీచార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిలన్, మస్తాన్, వినోద్, బాలాజీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు



# తల్లికి వందనం డబ్బులను విద్యార్థుల భవిష్యత్తుకు వినియోగించాలి

తాడిపత్రి, :విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.13,000 ఆర్థిక సహాయం అందిస్తోందని, ఆ నిధులను పూర్తిగా పిల్లల విద్యాభివృద్ధికే వినియోగించాలని తల్లిదండ్రులకు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) రామ గోవింద్ రెడ్డి పిలుపునిచ్చారు.




తాడిపత్రి పట్టణంలోని 11వ వార్డులో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు రఘురామిరెడ్డి అధ్యక్షతనమెగాఉపాధ్యాయ–తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 100 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతున్న 10 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం ఎంఈఓ రామ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, బెల్టులు తదితర అవసరమైన వస్తువులను అందిస్తోందన్నారు. పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపే విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం ప్రతి ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆంగ్ల మధ్యమ పాఠశాలగా మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరగా విద్యాశాఖ ఉన్నత అధికారుల సహకారంతో తమ వంతు కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శైదా ఖతూన్, మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్

గోరంట్ల,: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పెడపల్లి శ్రీనివాస్ నాయక్, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌ను పెనుగొండలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గిరిజన వర్గాల అభ్యున్న తికి, వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ సెల్‌ను మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎస్టీ సెల్ కార్యకలాపాలను విస్తరించి, గిరిజన యువతకు ఉపాధి, విద్య, సంక్షేమ అంశాల్లో పార్టీ తరఫున నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ట్రెజరర్ పోతుల రామకృష్ణారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, జడ్పీటీసీ పాలే జయరాం నాయక్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వ్యాపారంలో లాభాల పేరుతో బంగారు ఆభరణాలు కాజేసిన ఘటన.. కేసు నమోదు

తాడిపత్రి, వ్యాపారంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి బంగారు ఆభరణాలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసి, అనంతరం బెదిరింపులకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నె వారి పల్లి కాలనీకి చెందిన ఎర్రపరెడ్డి సరస్వతి (42), భర్త శివరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె నిర్వహిస్తున్న దుకాణంలో గుమస్తాగా పని చేసే లక్ష్మీదేవి మరియు ఆమెకు పరిచయం ఉన్న సింహాద్రిపురం గ్రామానికి చెందిన, ప్రస్తుతం తాడిపత్రిలో నివాసం ఉంటున్న శివ కలిసి చీరల వ్యాపారం నిర్వహిస్తే అధిక లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడి పెట్టాలని కోరినట్లు తెలిపారు. వ్యాపారం కోసం సుమారు రూ.5 లక్షల పెట్టుబడి అవసరమని చెప్పడంతో, తన వద్ద నగదు లేక సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలను వారికి ఇచ్చినట్లు సరస్వతి ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఆభరణాలను తీసుకున్న తర్వాత వాటిని తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు, అడిగినప్పుడు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు .

# చిరు వ్యాపారులకు మంత్రి సవితమ్మ చేయూత

## 4 వ వార్డులో తోపుడు బండ్ల పంపిణీ తో చిరు వ్యాపారం ప్రారంభం




గోరంట్ల,:రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత శాఖల మంత్రి యస్ సవితమ్మ చిరు వ్యాపారు లకు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని,కుటుంబాలు బలోపేతం కావాలని, తోపుడు బండ్ల పంపిణీ తో ఆదుకుంటున్నారు, అందులో భాగంగా గోరంట్ల 4 వ వార్డు లోని టీడీపీ నాయకుడు శ్రీనివాస సింగ్ కుటుంబా నికి హోటల్ నిర్వహణ కోసం తోపుడు బండిని అందజేశారు,దీంతో శుక్రవారం ఉదయం శ్రీనివాస సింగ్ హోటల్ ప్రారంభం చేశారు, ఈ కార్యక్రమంలో సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, డైరెక్టర్ చాంద్ బాషా, మైనార్టీ నాయకులు ఉస్మాన్ ఖాన్, మహబూబ్ బాషా,కృష్ణ సింగ్,ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మంత్రి శ్రీ సవితమ్మ మరియు టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరించడం లేదు

## పుట్టపర్తి జిల్లా రిజిస్ట్రార్ జి. కృష్ణ కుమారి,

పుట్టపర్తి,:జీ ఓ ఎం ఎస్ నంబర్ 396 ద్వారా రిజిస్ట్రేషన్ శాఖను గానీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలను గానీ ప్రైవేటీకరించడం లేదని పుట్టపర్తి జిల్లా రిజిస్ట్రార్ జి. కృష్ణ కుమారి తెలిపారు, సాంకేతిక పరిజ్ఞానంతో, సమయపాలనతో పారదర్శక సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల' ఏర్పాటు, పూర్తి అధికారాలు ప్రభుత్వానికే, చట్టబద్ధ అధికారాలు, పత్రాల పరిశీలన, నమోదు మరియు రికార్డుల నిర్వహణ సబ్ రిజిస్ట్రార్ల ఆధీనంలోనే కొనసాగుతాయన్నారు, ప్రజల ఆస్తి వివరాలు లేదా ప్రభుత్వ డేటా ఏ ప్రైవేట్ సంస్థకూ బదిలీ కాదు. డేటా భద్రతపై ఆందోళనలు నిరాధారమై నవన్నారు, డాక్యుమెంట్ రైటర్ల 'పెన్ డౌన్' ఉన్నప్పటికీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు,అపోహలు నమ్మకుండా, సేవలు మరియు వివరాల కోసం నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించగలరన్నారు,అపోహలు నమ్మకుండా సేవలు మరియు వివరాల కోసం పుట్టపర్తి సత్యసాయి జిల్లా పరిధిలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలను (బుక్కపట్నం, చిలమత్తూరు, సి.కె.పల్లి, ధర్మవరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, తనకల్లు) నేరుగా సంప్రదించా లన్నారు.



## 13 వ వార్డులో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం విజయవంతం



హిందూపురం, లేపాక్షి ట్రైమ్స్:హిందూపురం శాసన సభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం మున్సి పాలిటీ పరిధిలోని 13 వ వార్డు ఎస్. సడ్లపల్లి మరియు ఎన్ టి ఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో శు క్రవారం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచరు మీటింగ్ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మాజీ కౌన్సిలర్ ఆర్.సునీతావెంకటేశ్వరరెడ్డి, బీ. జే. పి సీనియర్ నాయకులు కిష్టప్ప, రాష్ట్ర ఉప్పర డైరెక్టర్ మణిప్రియా, శ్రీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మవరం ఇంచార్జ్ చిలకం మధు సుధన్ రెడ్డిని కలిసిన గోరంట్ల జనసేన నాయకులు

గోరంట్ల,:ధర్మవరం లో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం




మధు సుధన్ రెడ్డి నివాసం నందు జనసేన పార్టీ గోరంట్ల జనసేన నాయకులు ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి సురేష్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ లు మర్యాద పూర్వకంగా కలిశారు , అలాగే రానున్న స్థానిక సంస్థల ఎలక్షన్ లో భాగంగా జనసేన పార్టీ పెనుకొండ నియోజకవర్గం పోటీ చేసే స్థానలు గురించి చర్చించారు, అలాగే పార్టీకి సంబంధించిన పలు విషయాలపై సమీక్షించారు.

## తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశానికి హాజరైన తాడిపత్రి శాసనసభ్యులు జె.సి అస్మిత్ రెడ్డి



యాడికి, యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని జడ్పీ హైస్కూల్, ఏ.పీ. మోడల్ స్కూల్ లో జరిగిన తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా తాడిపత్రి శాసనసభ్యులు జె.సిఅష్మిత్ రెడ్డి హాజరైనారు. కార్యక్రమంలో అష్మిత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. చదువుతోపాటు ఆటలు సమాజంలో జరుగుచున్న పరిణామాలపై విద్యార్థిని, విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు పెంపకం

పుట్టపర్తి,: అటవీ శాఖ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు పెంపకం చేపట్టినట్లు బుక్కపట్నం రేంజ్ అటవీశాఖ అధికారులు తెలిపారు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం, సీడ్ బాల్స్ చల్లె కార్యక్రమం శ్రీ సత్యసాయి జిల్లా అటవీ శాఖ అధికారి. చక్రపాణి ఆదేశాల మేరకుశుక్రవారం గంగిరెడ్డిపల్లి బీటు,లోగోపి దేవరపల్లి అడవి ప్రాంతం , దొక్కల కొండ అడవి ప్రాంతం నందు పుట్టపర్తి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్ర నాయక్ ఆధ్వర్యంలో 18వేల సీడ్ బాల్స్ రావి , మర్రి ,జువ్వి ,మేడి, తుమ్మ, నారేపి వంటివి గంగిరెడ్డిపల్లి ,దిగువ చెర్లోపల్లి గ్రామస్తుల సహకారంతో చల్లించి నట్లు తెలిపారు.సీడ్ బాల్స్ చల్లడం వల్లఅడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపు , జీవవైవిధ్య పరిరక్షణలో సీడ్ బాల్స్ కీలక పాత్ర పోషిస్తాయనీ. మట్టి, సేంద్రియ ఎరువు ,స్థానిక విత్తనాలతో తయారు చేసిన సీడ్ బాల్స్‌ను అనువైన ప్రాంతాల్లో చల్లడం ద్వారా వర్షాకాలంలో మొలకెత్తి కొత్త మొక్కలు పెరిగే అవకాశాలుపెరుగుతాయనీ, సీడ్ బాల్స్ వల్లఅడవుల పునరుద్ధరణకు దోహదపడతాయనీపచ్చదనం పెరిగి పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుందనీనేల కోతను తగ్గించి భూసారాన్ని కాపాడు తాయనీ,పక్షులు,జంతువులకు సహజ ఆవాసాలు ఆహార వనరులు పెరుగుతాయనీ,స్థానిక జాతుల మొక్కల సంరక్షణకు తోడ్పడ తాయనీతక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో విత్తనాలు చల్లే అవకాశం కలుగుతుందనీ,వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో, కార్బన్ శోషణను పెంచడంలో సహాయపడతాయనీ,ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన , బాధ్యత పెంపొంది స్తాయనీ, తెలిపారు. ఈ సందర్భంగా గంగిరెడ్డిపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గిరీష్ , గంగిరెడ్డిపల్లి, దిగువ చెర్లోపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



# అనంతలో విద్య సంస్థల బంద్ సంపూర్ణం

### విద్యార్థి యువజన సంఘాల నాయకులపై పోలీసుల అమానుషం

### విద్యార్థి యువజన సంఘాల నాయకుల్ని కళాశాలలోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

### విద్యార్థులపై పోలీసులు విచక్షణారహిత దాడి

### కేఎస్ఆర్ కళాశాల ఎదుట రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి యువజన సంఘాలు నాయకులు

అనంతపురం,
ఢిల్లీ జంతర్ మంతర్ లో విద్యార్థుల పోరాటానికి సంఘీభావంగా శు క్రవారం అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్ర వ్యాప్త బంద్ సంపూర్ణంగా ముగిసింది. నీట్ పేపర్ లీకేజీ కి, 20 తేదీన ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై జరిగిన దమనకాండకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన రాజీనామా చేయాలని ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గ ప్రసాద్ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృద్వి ఎన్ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ఓబులేష్ పిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అల్లాం మాట్లాడుతూ 2014 నుండి ఎన్ .డీ.ఏ ప్రభుత్వం చేపట్టిన వివిధ రకాల ఉన్నత విద్యా పోటీ పరీక్షల నిర్వహణ లో 152 పేపర్ లీకులు జరిగాయి అని, దీని వలన కోట్లాది మంది విద్యార్థులు నష్టపోయా రని విమర్శించారు. 2024 నుండి ప్రతి సంవత్సరం నీట్ పేపర్ లీకేజీ జరుగుతున్నా మోదీ ప్రభుత్వం ఈ అక్రమాలకు ఎలాంటి బాధ్యత తీసుకోకుండా లక్షలాది విద్యార్థులకు అన్యాయం చేశారని, అనేక మంది విద్యార్థుల బలన్మరణా లకు కారకులయ్యారని వారు విమర్శించారు. అక్రమాలకు, మరణాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, మరణించిన విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని, దీనికి కారణమైన ఎన్.టీ.ఏను రద్దు చేసి, ఈ పోటీ పరీక్షలు పగడ్బందిగా నిర్వహించడానికి సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై పాశవికంగా దాడి చేయడం అమానుషమైన చర్య అని విమర్శించారు. ఢిల్లీ జంతర్మంతర్లో జరుగుతున్న విద్యార్థులు యువకులు యువతులపై జరిగిన దాడిని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్త అందులో భాగంగా అనంతపురం జిల్లాలో ఆర్ట్స్ కళాశాల నుండి మొదలైన బంద్ లో భాగంగా కె ఎస్ ఆర్ కళాశాలలో జరుగుతున్న తరగతులు బహిష్క రించాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు లోపలికి వెళ్లడాన్ని అడ్డుకున్న పోలీసులు రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకుల్ని అక్రమంగా పోలీస్ స్టేషన్లకు తరలించారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్ జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ధనంజయ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు శంకర్ పి ఎస్ యఫ్ ఐ జిల్లా కార్యదర్శి ప్రతిభ భారతి జిల్లా కార్యవర్గ సభ్యులు నవీన్ జిల్లా కౌన్సిల్ మెంబెర్ జయ నగర కోశాధికారి నాని నగర సహాయ కార్యదర్శి సాయి నగరనాయకుల సుస్రుత్, ఆఫ్సాన్,బాబ్జాన్, రాజు, ప్రశంత్, భాను, బలు, బాబీ, తులసిరెడ్డి, ఏఐవైఎఫ్ నగర నాయకులు రియాజ్,ఆనంద్, సమీరు, చంద్ర పాల్గొన్నారు.





## విజన్ లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం.

యాడికి, యాడికి మండలం ఉన్న విజన్ విద్యా సంస్థల యందు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసినటువంటి తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతూ విజన్ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వందన కార్యక్రమం నిర్వహించారు.. తల్లిదండ్రుల పాదాలకు నమస్కరిస్తూ రాబోవు రోజుల్లో వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేశారు. విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కేవలం విద్యార్థుల యొక్క పనితీరును ఏ విధంగా ఉందో చర్చించడానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మధ్య ఒక సమన్వయ వేదికగా ఉపయోగించుకోవాలని అలాగే ప్రతి విద్యార్థి మీద ప్రతి తల్లిదండ్రులు కనీసం ఒక గంట సేపు సమయాన్ని కేటాయించి వారి బంగారు భవిష్యత్తుకు అడుగులు వేసే విధంగా చూడాలని అలాగే ఇంటిదగ్గర టీనేజ్ లో ఉన్న పిల్లల్లో ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సెల్ ఫోన్ ఉపయోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించడం జరిగింది.. విద్యార్థులు ప్రవర్తనలో కలిగే మార్పులను నిత్యం గమనిస్తూ ఉండాలని భవిష్యత్తుకు మంచిగా ఉపయోగపడే పౌరులను తీర్చిదిద్దడమే మనందరి లక్ష్యమని తెలపడం జరిగింది.. పాఠశాలలో ఎటువంటి సమస్యలున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొని వచ్చి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని కోరడమైనది..అలాగే తల్లిదండ్రులు మరియు విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఏపీ గవర్నమెంట్ ఇంటిలో నలుగరు విద్యార్థులు ఉంటే 52,000, ముగ్గరు విద్యార్థులు ఉంటే 39వేల రూపాయలను అందజేశారని ఇలా ప్రతి ఇంటికి అందిందని హర్ష వ్యక్తం చేశారు.వారు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి మరియు మంత్రి లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.. 2026 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 592 మార్కులు సాధించిన చిత్ర వర్షిణి కలెక్టర్ చేతుల మీదుగా సైనింగ్ స్టార్ పురస్కారాన్ని అందుకొని విజన్ విద్యార్థులను ఉద్దేశించి కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు అంటూ నా విజయంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర చాలా ఉందని ప్రతి ఒక్కరు కష్టపడి చదవాలని సూచించడం జరిగింది..




అలాగే ఆమెకు తల్లిదండ్రుల్లో ఒకరైన నాని గారు 1016/- ఇచ్చి ప్రోత్సాహం అందించారు.అలాగే పెద్దవడుగూరు మండలం కదిరగుట్టపల్లి గ్రామానికి చెందిన మూడు నెలల చిన్నారి ఎస్ఎంఏ టైపు వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకొని విజన్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక సహకారం అందించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు మరియు విజన్ ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

### ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

అనంతపురం :ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాగ్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓ అనంతపురము ప్రేమనాథ్ కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, తదితరులు పాల్గొన్నారు.



### శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత

# పోలీసులతో పాటు ప్రజలపై ఉంది

## రూరల్ సీఐ.సునీత, పట్నం ఎస్ఐ. అర్షద్

ముదిగుబ్బ, :ముదిగుబ్బ మండలం లోని మలక వేమల క్రాస్ వద్దగల పట్నం పోలీస్ స్టేషన్ లో ముదిగుబ్బ మండలం రూరల్ సీఐ సునీత మరియు ఎస్ఐ అర్షద్ ల ఆధ్వర్యంలో ప్రజాశాంతి భద్రతల బలోపేతం పై చర్చ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర యాదవ సంఘం కార్యదర్శి చినగాని నరసింహ యాదవ్ మరియు మలకవేమల తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు బండి మల్లికార్జున మరియు ఇతర గ్రామ ముఖ్య నాయకులు ప్రజలు హాజరయ్యారు. రూరల్ సీఐ సునీత మాట్లా డుతూ, శాంతిభద్రతలు కేవలం పోలీసు వ్యవస్థకే పరిమితం కాదని ప్రజలు, నాయకులు కూడా ఇందులో భాగస్వామ్యం పొంది పటిష్టమైన భద్రతా వ్యవస్థను పొందగలరని సూచించారు. గ్రామ పరిధిలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాలు మరియు అసాంఘిక కార్యక్రమాల అనర్థాలపై ఫ్లెక్సీల ఏర్పాటు మరియు ఇతర అవగాహన కార్యక్రమాలకు సంబంధించి ఫండ్ ను మనమందరం కలిసి ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని కోరారు. సీనియర్ నాయకులు చినగాని నరసింహ యాదవ్ ఈ బృహత్తర కార్యక్రమానికి తన విరాళంగా 20000 రూపాయలు, బండి మల్లికార్జున 10000 రూపాయలు, ముని స్వామి నాయక్ 10000, పైపుల రమణ 10000 సాంబశివ యాదవ్ 5000 రూపాయలు ఇలా తదితర గ్రామస్తులు నాయకులు కలిపి 150000 రూపాయలను తమ విరాళంగా అందజేశారు. తక్షణ స్పందన పై రూరల్ సీఐ సునీత విరాళాలు అందజేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

## ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

తాడిపత్రి,: ప్రభుత్వ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ సుఖం పాలెం తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి స్థానికులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా వృద్ధులను కలిసి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పెన్షన్లు తదితర సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. కాలనీలోని చిన్నారులు,విద్యార్థులతో కూడా ముచ్చటించి వారి చదువుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పర్యటన సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులను వెంటనే అక్కడికే పిలిపించి పరిష్కార చర్యలు చేపట్టించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్య వేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ రవీంద్రారెడ్డి, రంగనాథ్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, సంజీపురం పవన్, విజ్జి మల్లికార్జున, షేక్ సావలి, చల్లా రఘునాథ్, రామాంజనేయులు, గంగరాజు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లి తండ్రులు పిల్లల ప్రవర్తన పై నిరంతరం నిఘా వుండాలి

## ఎస్. ఐ.ఎస్ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి, : తల్లి తండ్రులు పిల్లల ప్రవర్తన పై నిరంతరం నిఘా ఉంచాలని శ్రీ సత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి ఎస్. ఐ.ఎస్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల యందు జరిగిన తల్లి తండ్రులు, సంరక్షకుల సమావేశంలో ఎస్. ఐ ఎస్ సత్య నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంలో తల్లి తండ్రులను , విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లి దండ్రులు వారి పిల్లల పట్ల చూపవలసిన బాధ్యతలను వారికి అవగాహన చేసారు. తల్లిదండ్రులు పిల్లలని ఎలా పెంచాలో సమాజానికి ఎలాంటి పిల్లల్ని మనం తయారు చేసి ఇస్తున్నామో తెలుసుకోవాలని అన్నారు, చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు, పిల్లలు వెళ్లకుండా గ్రూపులు కట్టి, గొడవలు వెళ్లకుండా , మధ్యానికి బానిస కాకుండా, పోక్షో చట్టం గురించి అవగాహన చేస్తూ ప్రస్తుతం చెన్నేకొత్తపల్లి నందు జరిగిన సంఘటనలు వారికి తెలియ జేసారు,బాగా చదువుకొని ఉజ్వలమైన భవిష్యత్తుని ఇవ్వాలని ప్రతి ఒక్క పేరెంటుకు స్టూడెంట్ కు తెలియచేస్తూ వారికొక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో ఆయా పాఠశాలల విద్యార్థులు, తల్లి తండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సమస్యలకు ఎక్కడికక్కడే తక్షణం పరిష్కారం చూపండి

నల్లమాడ(పుట్టపర్తి), :ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసు కొన్నారు. వారి ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణం పరిష్కారం చూపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు చిన్నచిన్న సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, అధికారులందరూ ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరించి వీలైనంత వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, అర్హత ఉన్న సమస్యలను ప్రాధాన్యత తో పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు తహశీల్దార్ మనోజ్ కుమార్, ఎంపీడీవో అంజనప్ప ,ప్రజాప్రతినిధులు సహకార సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి , సీఐ శ్రీనివాసులు,మండల కన్వీనర్ శంకర్ , మాజీ మండల కన్వీనర్ కేశవ రెడ్డి,సలాం ఖాన్ గన్ రెడ్డి, రాజారెడ్డి, బుట్టి నాగభూషణం, మంజు నాథ్ రెడ్డి,లక్ష్మన్న , మణి మాల, అరవింద్ ,పార్టీ నాయకులు, కార్య కర్తలు,మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడిపత్రి, తాడిపత్రి మండలం తేరన్నపల్లి గ్రామ సమీపంలోని 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే అత్యవసర మరమ్మత్తు పనుల కారణంగా శనివారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా తాడిపత్రి పట్టణం, పరిశ్రమలు మరియు పరిసర ప్రాంతాల్లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని, మరమ్మత్తు పనులు సజావుగా పూర్తయ్యేందుకు ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కేజీబీవీ బాలికల పాఠశాల లో పేద విద్యార్థినిలకు నోట్ పుస్తకాల పంపిణి

## టీడీపీ మండల కన్వీనర్ తుమ్మల మనోహర్ నాయుడు

ముదిగుబ్బ,: ముదిగుబ్బ మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా



గాంధీ బాలికల పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ తుమ్మల మనోహర్ నాయుడు మరియు ధర్మవరం డివిజనల్ ఆఫీసర్ జనార్దన్ రావు మరియు ఇతర మండల అధికారులు పాల్గొన్నారు. కన్వీనర్ తుమ్మల మనోహర్ నాయుడు మాట్లాడుతూ, కేజీబీవీ పాఠశాలల్లో ఎక్కువ శాతం నిరుపేద విద్యార్థులు చదువు తారని అయినప్పటికీ చదువుల్లో అత్యంత ర్యాంకింగ్ శాతం కేజీబీవీ లో నుంచే ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా బాలికల సంరక్షణకై అనేక స్కీములను ప్రవేశపెడుతోందని విద్యార్థినిలు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయిలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేద విద్యార్థులకు ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన మహేష్ పాఠశాలలోని విద్యార్థినిలకు నోటు పుస్తకాలు తుమ్మల మనోహర్ నాయుడు మరియు డిడిఓ జనార్దన్ రావుల చేతులమీదుగా అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిరుపేదల పట్ల దాతలు తమ దయార్థ భావంతో విరివిగా దానాలు చేయడం అత్యంత పుణ్యకార్యమని తెలిపారు. కార్యక్రమం లో ముదిగుబ్బ మండల ఎం ఈ వో. రమణప్ప, హాస్టల్ వార్డెన్ ఫకృబీ, మరియు హాస్టల్ ఉపాధ్యాయినిలు, సిబ్బందిపాల్గొన్నారు.

# బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పాదయాత్ర

## 26న హిందూపురం నుంచి కదిరి వరకు తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహణ

లేపాక్షి, :హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ సినిమా చిత్రీకరణ సమయంలో జరిగిన చిన్న ప్రమాదంలో కాలికి గాయమై ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ హిందూపురం నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో ప్రత్యేక పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రకటించింది. ఈ పాదయాత్ర ఈ నెల 26వ తేదీ (ఆదివారం) ఉదయం 8 గంటలకు హిందూపురం పేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ప్రారంభమై, కదిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తంతతెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం పిలుపునిచ్చింది. అలాగే లేపాక్షి మండలం నుంచి పాదయాత్రలో పాల్గొనదలిచిన వారు తమ పేర్లను ఈ నెల 25వ తేదీ (శనివారం) ఉదయం 10 గంటలకు నమోదు చేసుకోవాలని కోరారు. పాదయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించాలని విజ్ఞప్తి చేసింది.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టి చదువుకోవాలి

## బాలికోన్నత పాఠశాలలో మెగా పిటిఎమ్ లో మండల స్థాయి అధికారులు



ముదిగుబ్బ,: ముదిగుబ్బ మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయురాలు రమాదేవి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ ముదిగుబ్బ మండల కన్వీనర్ తుమ్మల మనోహర్ నాయుడు, అర్బన్ సీఐ శివరాముడు, మండల ఎంపీడీవో హాజీవలి, ఎంఈఓ రమణప్ప, ముదిగుబ్బ మండల తహసిల్దార్ మహేశ్వర్ రెడ్డి తదితర ముఖ్య మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో భాగమయ్యారు. పిల్లలు మరియు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ముఖ్య అతిథులు ప్రసంగిస్తూ, విద్యావ్యవస్థలో అత్యంత గణనీయ మార్పులు వస్తున్నాయని తదనగుణంగా విద్య నైపుణ్యాలను పాఠశాల ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని బోధిస్తున్నారని అన్నారు. కావున ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి నిలిపి ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. తమ పిల్లల విద్యా పురోగతిపై అప్పుడప్పుడు లేదా తరచూ పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులతో కనుక్కోవడం వల్ల విద్యార్థులను సరైన మార్గంలో నడిపేందుకు వీలవుతుందని తెలిపారు. పిల్లల్లో చదువు పట్ల భయం పోయేలా వారిని మానసిక ధైర్యంతో ముందుకు నడపాలంటే అది తల్లిదండ్రుల వల్ల మాత్రమే అవుతుందని హితవు పలికారు.

# వర్షం కోసం గ్రామల్లో రామస్వామి భజనలు

తాడిమర్రి మండల పరిధిలోని పిన్నదరి గ్రామంలో శుక్రవారం ఉదయం వర్షం కోసం పూజలు భజనలు నిర్వహించడం



జరిగింది.గ్రామ నడిబొడ్డున గల శ్రీరామ స్వామి దేవాలయంలో ఉదయం నుంచి విరాటపర్వం పారాయణం మరియు పిన్నదరి గ్రామ ప్రజలు భజనలు నిర్వహించడం మంగళహారతి నిర్వహించరుభజనలు చేస్తూ గుంజె పల్లి,నలిపిరెడ్డిపల్లి,కునుకుంట్ల మద్దెల చెరువు భీమారాయనపేట మీదుగా సాయంకాలం పిన్న దరి కీ పెద్దలు చేరుకున్నారు ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణిస్తే పిన్నదరి గ్రామ ప్రజలు వేసుకున్న పంటలకు తాగునీటికి సాగు నీటికి ఎటువంటి ఇబ్బంది ఉండదని భగవంతుని కోరుకుంటున్నాను.

# మెగా పిటిఎం తో పాఠశాలల బలోపేతం

గోరంట్ల, :గోరంట్ల పట్టణంలోని మండల విద్యా వనరుల ఆవరణం లో గల ప్రాథమిక పాఠశాల లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమం నిర్వహించారు, స్కూల్ లోని ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తో ముఖాముఖి, పలు సూచనలు తెలియ జేశారు ,ఈ కార్యక్రమంలో సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్ , బీరేవేణుగోపాల్ రాయల్, జయరామ్, మాజీ వార్డు సభ్యులు అగిసం నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరక్టర్ దేవాంగం శ్రీని వాసులు , మునిస్వామి,మల్లి కార్జున , నారాయణ , శంకర తదితరులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో 9,10 తరగతి విద్యార్థులకు డైరీలను పంపిణీ కార్యక్రమం

గోరంట్ల, :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ, సంక్షేమ,చేనేత, జౌళి మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు గోరంట్ల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్, వానవోలు, పులేరు,నందు మెగా పేరెంట్స్,టీచర్స్ 4 0. మీటింగ్ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుత్తా బాలక్రిష్ణ చౌదరి కూటమి ప్రభుత్వం అందించిన తల్లికి వందనం గురించి ముఖాముఖీ చర్చించారు, అనంతరం పిల్లలు తమ తల్లి తండ్రులను సన్మాన కార్యక్రమం నిర్వ హించారు,ఈ కార్యక్రమంలో తన నియోజకవర్గం విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి సవితమ్మ ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 9,10 తరగతి విద్యార్థులకు డైరీలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళలడైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్,బాయ్స్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఈశ్వర్ ప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా రెడ్ క్రాస్ సోసైటి అధ్యక్షులు జిఎం సురేష్, గోరంట్ల టౌన్ 6మ్యాన్ కమిటి సభ్యులు నాగేనాయక్,నిమ్మల శ్రీధర్,బీరే వేణు గోపాల్ రాయల్,గిరిధర్ గౌడ్, కురమల జయరాం, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి,స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహ,జనసేన మండల అధ్యక్షులు సంతోష్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సింగల్ విండో డైరెక్టర్ నబిరసూల్, దేవాంగం శ్రీనివాసులు, బీజేపీ మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ,మాజీ వార్డు మెంబర్లు నాగరాజు,పసుపులేటి శ్రీనివాసులు, బీజేపీ మేదర శ్రీనివాసులు, కూరబ మల్లిఖార్జున, ఉపాధ్యాయులు,విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్టానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# అధికారుల సమన్వయం తో ఆసుపత్రి అభివృద్ధి సాధ్యం

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

## విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## మెరుగైన వైద్య సేవలు అందించండి

## అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం,:అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం శుక్రవారం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 3వ అంతస్తులోని సెమినార్ హాల్ నందు జిల్లా కలెక్టర్ మరియు హెచ్.డి.ఎస్ చైర్మన్ ఓ.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు,ఈ సమావేశానికి కమిటీ ఉపాధ్యక్షులు, అనంతపురం అర్బన్ శాసనసభ్యులు శ్రీ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.డి.మల్లేశ్వరి గత సమావేశం తీర్మానాల అమలు ప్రగతి, కావాల్సిన కొత్త సౌకర్యాల ప్రతిపాదనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ...గత సమావేశం తీర్మానాల అమలు అంశాలవారిగా సమీక్షించారు, ఆసుపత్రి భద్రతపై సెక్యూరిటీ ఏజెన్సీ ఒప్పందం మేరకు సిబ్బంది పెంచకపోతే బ్లాక్ లిస్ట్ చేయాల్సి ఉంటుందని, భద్రతా చర్యలపై నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలు వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆసుపత్రి సేవలకు ఆటంకం కలిగించే వ్యక్తులు ఆసుపత్రి వ్యవస్థపై నమ్మకం తగ్గించే వార్తలపై కఠినంగా పనిచేయాలన్నారు. ఆస్పత్రిలో సందర్శించే వ్యక్తుల వివరాలను రిజిస్టర్లు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే రోగులకు మానవతా దృక్పథంతో అంకితభావంతో సేవలందించాలని సూచించారు. గత సమావేశంలో తీర్మానిం చిన పనులు పెండింగ్ ఉందని గ్రహించిన జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నియామకాల అనుమతులు ఆలస్యం అవడాన్ని గమనించి తన ద్వారా ఫైల్ రన్ చేయాలన్నారు, ఆసుపత్రి క్యాంటీన్ అనుమతి వారంలో పూర్తిచేయా లన్నారు, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ నిర్వహణ నెలవారీ చెల్లింపుతో మొదలు పెట్టాలన్నారు. అభివృద్ధి అజెండా తయారీలో విభాగాధికారుల మధ్య సమన్వయం లేకపోవడం తీర్మానాల అమలులో అలసత్వంకనపడుతున్నదని విచక్షణతో సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు పటిష్టంగా తీసుకోవాలని,
ఆసుపత్రి పరిసరాలు, వార్డులలో పారిశుధ్యం మరింత మెరుగు పరచాలని, తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ముఖ్యంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వెంటనే త్రాగునీటి సరఫరా అయ్యేవిధంగా పైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు.హెచ్.డి.ఎస్ నిధులను ఆసుపత్రికి అవసరమైన ఆధునిక పరికరాల కొనుగోలు కొత్త తీర్మానాలపై చేసిన పాత తీర్మానాలను పూర్తీ చేయాలని, కొత్త అంశాలు ఏవైనా ఉంటే హెచ్ ఓ డి లతో సంబంధిత విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి మినిట్స్ రికార్డు చేసి కమిటీ లో పెట్టాలని, నెల తరువాత మరోసారి సమావేశం నిర్వహించా లని అప్పటికి పూర్తి చేయాలన్నారు. బయోమెడికల్ వెస్ట్ నిర్వహణ పై పిర్యాదులు ఉన్నాయి. సెగ్రిగేషన్ వార్డులో జరిగేలా చేయండి నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఆసుపత్రి సామాన్య వ్యర్థాలను డంపర్ బిన్ లు పెట్టి రోజువారీ కలెక్ట్ చేయాలని కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఒక మాసం తర్వాత తిరిగి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించ బడుతున్న నేపథ్యంలో పెండింగ్లో ఉన్న పనుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గత సమావేశంలో తీర్మానించిన పనులకు సంబంధించి అమల్లో భాగంగా నిర్లక్ష్యం తగదని సొంత నిర్ణయాలు ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దని హెచ్చరించారు. ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వారికి ప్రత్యేక లేఖ వ్రాసి ఫిర్యాదు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం ఎమ్మెల్యే శ్రీ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ..

ఆసుపత్రికి రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోందని, దానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు, ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లో క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి గత ఆరు నెలలుగా ఎలాంటి ప్రగతి లేదన్న అంశంపై అసంతృప్తి వ్యక్తం పరిచారు. అలాగే వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే సహించలేదు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డా. మల్లేశ్వరి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయ డా .విజయశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జున రెడ్డి, ఆర్.ఎం.ఓ డా.హేమలత, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డా. బెన్ డిక్ట్,డి.ఎం.హెచ్.ఓ కట్టా వెంకటేశ్వర్లు, డి.సి.హెచ్.ఎస్ డా.నవీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత్ రావు, ఈ.ఈ రామ్ మోహన్, హెచ్.డి.ఎస్ కమిటీ సభ్యులు, ఆర్.డి.టి విశాలా ఫెర్రర్, ఓ.రత్నమయ్య, మిద్దెల నరసింహులు, కొప్పుల వెంకటరమణయ్య, ఆసుపత్రి ఏ.డి రమణ వైద్య కళాశాల ఏ.డి సాయి గ్రేసీ వివిధ విభాగాధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

# విద్యార్థి యొక్క విద్యాభివృద్ధి కొరకు రూ 10116 రూపాయిల ప్రోత్సాహక బహుమతి




చెన్నేకొత్తపల్లి, : 2025 --2026 వ విద్యా సంవత్సరంలో శ్రీ సత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన మండలంలోని ముష్టి కోవెల గ్రామానికి చెందిన. చెన్నప్ప, గాయిత్రి దంపతుల కుమారుడు చందు అనే విద్యార్థి గత విద్యాసంవత్సరం లో జరిగిన పదవ తరగతి పరీక్షల లో 490 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచి పాఠశాలలోనే టాపర్ గా నిలిచాడు. శుక్రవారం జరిగిన పి.టి.ఎం. 4.0 ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం లో భాగంగా చెన్నేకొత్తపల్లి కి చెందిన ఈడిగ చెన్నకేశవ గౌడ్ ముందుకు వచ్చి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి చందు యొక్క విధ్యాభి వృద్ధి కొరకు ప్రోత్సాహక బహుమతి రూ 10,116 రూపాయలను చెన్నేకొత్తపల్లి మండల తహసిల్దార్ సురేష్ కుమార్ చేతులు మీదుగా నగదును అందింప చేశారు. రాష్ట్రంలో వున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం విధ్యాభివృద్ధికొరకు ఎంత గానో కృషిచేస్తోందని , నేటి విద్యార్థులే రేపటి భారతీయ పౌరులు అని వారి ఉన్నతమైన విద్యకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగా తన వంతు ప్రోత్సాహక బహుమతిని ఇవ్వాలి అని నిర్ణయించుకుని విద్యార్థి చందు కి తన వంతు అండగా నిలిచానని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యలో పోటీపడి ,ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, ఆ లక్ష్యాలను చేరుకోవడానికి ఇప్పటి నుండియే ప్రణాళిక బద్దంగా, క్రమ శిక్షణ తో విద్యను అభ్యసించి ఉన్నతమైన విద్యను అందిపుచ్చుకొని, తల్లి తండ్రులకు, గ్రామానికి, పాఠశాలలకు,సమాజానికి సేవచెయ్యాలని ఆయన అన్నారు.

# ఇప్పటికీ సింగిలే..!




ఒకప్పుడు ఆనందం సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న హీరోయిన్ రేఖ వేదవ్యాస్ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, పెళ్లి గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో రేఖ వేదవ్యాస్ మాట్లాడుతూ.. తాను ఇప్పటికీ పెళ్లి చేసుకోలేదని వెల్లడించారు. సల్మాన్ ఖాన్‌లాగే నేనూ సింగిల్‌గానే ఉండిపోతానేమో అంటూ నవ్వేశారు. తాను ఇంకా సింగిల్‌గా ఉన్నానని చెప్పినా చాలామంది నమ్మరని,ఎవరో ఒకరు ఉంటారులే అని అనుకుంటారని అన్నారు. తనకు కాబోయే భర్త ఎలా ఉండాలని అడిగిన ప్రశ్నకు రేఖ ఎంతో పరిపక్వతతో సమాధానం ఇచ్చారు. యవ్వనంలో జీవిత భాగస్వామి గురించి ఎన్నో అంచనాలు, పెద్ద జాబితాలు ఉండేవని, కానీ ఇప్పుడు అలాంటివి ఏమీ లేవని చెప్పారు.పర్‌ఫెక్ట్ మనిషి ఎవరూ ఉండరు. నేనూ పర్‌ఫెక్ట్ కాదు. నన్ను నిజంగా ప్రేమించే మంచి మనసున్న వ్యక్తి దొరికితే చాలుఅని తెలిపారు. ఎత్తు, రంగు, రూపం వంటి విషయాలకు తాను ప్రాధాన్యం ఇవ్వనని, మంచి హృదయం ఉంటే అదే జీవితాంతం నిలిచే అందమని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో సరదాగా మాట్లాడుతూ.. నిజంగా పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశం ఉన్నవారు తన ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్ చేయొచ్చని చెప్పారు. అయితే టైమ్‌పాస్ కోసం కాదు, జీవిత భాగస్వామిగా ఆలోచించే వారు మాత్రమే సంప్రదించాలని స్పష్టం చేశారు.

# ఇక నా జీవితం నాదే ..




టాలీవుడ్ అందాల భామ అనుపమ పరమేశ్వరన్ తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. అయితే ఈసారి కారణం ఆమె కొత్త సినిమా కాదు. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన ఓ ఎమోషనల్ పోస్ట్ వల్ల. ఇంతకీ ఏం జరిగింది? ఏమన్నారు? ఇక గత కొంతకాలంగా అనుపమ పరమేశ్వరన్, తమిళ స్టార్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ ప్రేమలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ జంటగా 'బైసన్' సినిమాలో నటించారు. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే దగ్గరయ్యారనే వార్తలు వచ్చాయి. కొన్ని వ్యక్తిగత ఫొటోలు, ముఖ్యంగా ఇద్దరూ కలిసి కనిపించిన ఒక సన్నిహిత ఫొటో వైరల్ కావడంతో ఈ ప్రచారానికి మరింత ఊతం ఇచ్చింది. దీంతో త్వరలోనే ఈ జంట ఒకటి కాబోతున్నారు. త్వరలోనే పెళ్లి చేసుకుంటారనే కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ రిలేషన్‌పై ఇద్దరూ ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు. అయితే తాజాగా అనుపమ పరమేశ్వరన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మొదట ఆమె కొన్ని ఫొటోలు షేర్ చేస్తూ, 'ఈ పోస్టు పెట్టడానికి ఎవరి అనుమతి అవసరం లేదు. క్యాప్షన్ కోసం కూడా ఎవరినీ ఎదురు చూడాల్సిన అవసరం లేదు'అనే భావన వచ్చేలా రాసింది. ఈ వ్యాఖ్యలు చూసిన చాలామంది నెటిజన్లు ఆమె జీవితంలో ఏదో మార్పు జరిగిందని అనుకుంటున్నారు. ఈ క్రమంలో అనుపమ మరో లాంగ్ భావోద్వేగ పోస్టు చేసింది. మరో పోస్ట్‌లో 'కొన్నిసార్లు మనశ్శాంతి కోసం ముగిసిపోయిన మార్గాలను వదిలేయాల్సి వస్తుంది. ఈ రోజు నుంచి నా గలాన్ని నేనే ఎంచుకుంటా.. నా జీవితాన్ని నేనే ఎంచుకుంటున్నాను. ఇకపై ఎవరి అనుమతులు అవసరం లేదు. భయం లేదు. నన్ను నేను మళ్లీ కనుగొంటున్నాను. నా జీవితంతో మళ్లీ ప్రేమలో పడుతున్నాను" అంటూ రాసుకొచ్చింది. అంతేకాదు, 'చాలా కాలంగా నేను చెప్పాలనుకున్న విషయం ఉంది. కానీ చెప్పే అవకాశం రాలేదు. నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమను నేను ఎప్పుడూ అనుభూతి చెందాను. నన్ను మళ్లీ నా వైపుకే నడిపించిన విశ్వానికి కృతజ్ఞతలు. ఇకపై నా జీవితాన్ని నేనే జీవిస్తాను'అంటూ భావోద్వేగంగా పేర్కొంది.

# నాతో నటించిన హీరోలంతా రాజకీయ నేతలే ..




తాజాగా బాలీవుడ్ సీనియర్ నటుడు బాబీ డియోల్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన బాబీ డియోల్.. తనతో కలిసి నటించిన దక్షిణాది స్టార్ హీరోలు రాజకీయాల్లోనూ అద్భుత విజయాలు సాధిస్తున్నారని సరదాగా వ్యాఖ్యానించారు. నాతో కలిసి నటించిన సౌత్ హీరోలంతా రాజకీయాల్లోకి వెళ్లి మంత్రులు, ముఖ్యమంత్రులు అవుతున్నారు. ఇది నిజంగా చాలా ఆసక్తికరంగా, సరదాగా అనిపిస్తుంది అంటూ నవ్వుతూ చెప్పారు.టాలీవుడ్ నటసింహం నందమూరి బాలకృష్ణతో కలిసి డాకు మహారాజ్ సినిమాలో నటించిన విషయాన్ని గుర్తు చేసుకున్న బాబీ.. బాలకృష్ణ చాలా కాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉంటూ ప్రజల మద్దతుతో వరుస విజయాలు సాధించడం అభినందనీయమని అన్నారు. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్తో కలిసి హరిహర వీరమల్లు సినిమాలో నటించడం మంచి అనుభవమని చెప్పారు. ఆ సినిమా తర్వాత పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం విశేషమని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి నటించిన జన నాయగన్ సినిమా గురించి కూడా ఆయన ప్రస్తావించారు. విజయ్ చాలా సింపుల్ వ్యక్తి అని, ప్రచారం చేసుకోవడం ఆయనకు ఇష్టం ఉండదని చెప్పారు. అలాంటి వ్యక్తి ప్రజల మద్దతుతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగడం గొప్ప విషయమని ప్రశంసించారు.తమిళ స్టార్ హీరో సూర్యతో కలిసి చేసిన కంగువా సినిమా ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించకపోయినా, ఆ చిత్రంలో పనిచేయడం తనకు మంచి అనుభవంగా మిగిలిపోయిందని బాబీ డియోల్ తెలిపారు. తన వ్యాఖ్యలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవద్దని కూడా బాబీ డియోల్ స్పష్టం చేశారు.

# ఆయన డైరెక్షన్‌లో 'లేడీ పవర్ స్టార్' సినిమా?



గ్లామర్, హడావుడి కంటే పాత్రకు ఉన్న ప్రాధాన్యతకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు సాయి పల్లవి అందుకే ఆమెను అభిమానులు ప్రేమగా 'లేడీ పవర్ స్టార్' అని పిలుస్తారు. టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, మార్కెట్‌ను సంపాదించుకున్న ఆమె, ఒకవైపు పెద్ద హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు నటనకు మంచి అవకాశమున్న కథానాయిక ప్రాధాన్య చిత్రాలను ఎంచుకుంటూ కెరీర్‌ను బ్యాలెన్స్ చేస్తున్నారు. ప్రస్తుతం నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న బాలీవుడ్ భారీ ప్రాజెక్ట్ 'రామాయణ'లో రణ్‌బీర్ కపూర్ సరసన సీతగా నటిస్తూ దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే, టాలీవుడ్‌లో 'తండేల్' తర్వాత ఆమె మరే కొత్త తెలుగు సినిమాను అధికారికంగా ఒప్పుకోలేదు. ఈ క్రమంలోనే తాజాగా తెలుగులో ఓ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ దర్శకుడు ఎవరో కాదు కిషోర్ తిరుమల ఫీల్ గుడ్ డ్రామాలు, భావోద్వేగాల మేళవింపుతో సినిమాలు తీసే దర్శకుడు కిషోర్ తిరుమల, ఈసారి తన మూస పద్ధతిని పక్కన పెట్టి ఒక పవర్ ఫుల్ లేడీ ఓరియెంటెడ్ కథను సిద్ధం చేశారట. 'నేను శైలజ', 'ఆడవాళ్లు మీకు జోహార్లు' వంటి సినిమాలతో కుటుంబ ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇటీవల 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో మంచి విజయాన్ని అందుకున్నారు. అదే ఉత్సాహంతో పూర్తిగా కథానాయిక చుట్టూ తిరిగే ఒక మంచి కథను రాసుకుని, దానికి సాయి పల్లవి అయితేనే పూర్తి న్యాయం జరుగుతుందని భావించి ఆమెను కలిసినట్లు సమాచారం. ఈ కథలో ఉన్న డెప్త్, నటనకు ఉన్న స్కోప్ చూసి సాయి పల్లవి కూడా ఈ ప్రాజెక్ట్ పట్ల సానుకూలంగా స్పందించినట్లు ఇండస్ట్రీ టాక్. కిషోర్ తిరుమల మార్క్ భావోద్వేగాలకు, సాయి పల్లవి సహజమైన నటన తోడైతే థియేటర్లలో మరో అద్భుతం జరగడం ఖాయమని సినీ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా కథకు చివరి మెరుగులు దిద్దుతున్నారని, ఇందులో కథానాయిక పాత్రను రకరకాల కోణాల్లో చాలా కొత్తగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది.

# అమెజాన్‌కు షాక్, 'జన నాయగన్' జీ5 లోనే ?



తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు') ఎట్టకేలకు జూలై 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. రిలీజ్‌కి ముందు ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే మూవీ విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఓపెనింగ్స్ రాకపోయినా, ఇప్పుడు సినిమా ఓటీటీ హక్కుల వ్యవహారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దళపతి వెట్రి కొండన్ పాత్రలో కనిపించారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, ప్రియమణి, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు.సినిమాలో విజయ్ మాస్ ఎలివేషన్స్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకున్నప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం, కొన్ని సన్నివేశాలు సాగదీతగా ఉండటంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. . సినిమా విడుదలకు ముందే అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సుమారు రూ.110 కోట్లకు సొంతం చేసుకునే దిశగా చర్చలు జరిపినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపించాయి. అయితే విడుదల ఆలస్యం, ఇతర కారణాలతో ఆ ఒప్పందం చివరికి కుదరలేదని సమాచారం. ఆ తర్వాత ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా హక్కులను సుమారు రూ.50 కోట్లకు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో దాదాపు రూ.60 కోట్ల తేడాతో ఓటీటీ భాగస్వామి మారిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

Edited, Printed And Published Owned By K. Naresh Kumar, Flat No: 309/2, Krishna Plaza, Khairatabad, Hyderabad-50004. TELANGANA STATE, Website: www. prajamudra.Com, Email:mudranewstelugu@gmail.com, cell: 9573800809